## క్లుప్తంగా

### సీఎంను కలిసిన ఎమ్మెల్సీ



నెల్లూరు (టౌన్): అసెంబ్లీ సమావేశాల అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. తాజా రాజకీయ అంశాలపై సీఎం మాట్లాడి చంద్రశేఖర్‌రెడ్డికి పలు సూచనలు చేశారు.

### క్రీడలతో ఉన్నతంగా ఎదగాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు క్రీడలు ఎంతో తోడ్పడతాయని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కొండాయపాళెం రోడ్డులోని జనహిత, వాత్సల్య చిన్నారులు, వృద్ధాశ్రమంలో భారతీయ విద్యావికాస్ స్కూల్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు మాట్లాడారు. చిన్నారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తిన సందర్భాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల్లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీరికి కార్డులను అందజేయాలని కోరారు. అత్యవసర సమయాల్లో తనకు ఫోన్ చేసినా, సమాచారం పంపినా తక్షణమే స్పందిస్తానని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. అనంతరం చంద్రశేఖర్‌ను సత్కరించారు. ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, అరవ పరిమళ, రాఘవ, విశ్వనాథం, శ్రీనివాసులు, విజయమ్మ, బాలరాజు, మల్లికార్జున్, ఖాదర్‌మస్తాన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

### కాలువల్లో ఆయిల్‌బాల్స్ విడుదల



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో గల కాలువల్లో ఆయిల్ బాల్స్‌ను మంగళవారం వదిలారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటరమణ, వెంగళ్‌రెడ్డి, శీనయ్య, నాగరాజు, దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, జక్కావుల్లా తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు సినిమాకు ప్రపంచ స్థాయి గుర్తింపు



కేక్‌ను కట్ చేస్తున్న కృష్ణారెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): తెలుగు సినిమాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించిందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని 25 కళాసంఘాల చాంబర్‌లో తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకలను నెల్లూరు సినిమా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సింహపురి సీమ నుంచి ఎందరో నటులు, దర్శకులు రాణించి ఎంతో గుర్తింపును తీసుకొచ్చారని చెప్పారు. చిత్ర రంగానికి నెల్లూరు ప్రస్తుతం హబ్‌గా మారిందన్నారు. నెల్లూరు సినిమా అసోసియేషన్ అధ్యక్షుడు శివలంకి జనార్దన్, గౌరవాధ్యక్షుడు బాలు, దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, బన్నీ నాగేంద్ర, చంటి, రూప, రేణుప్రియ, సుధాకర్‌రెడ్డి, కోడూరు శైలజ తదితరులు పాల్గొన్నారు.

• ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులో తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకలను ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, నెల్లూరు డివిజన్ కన్వీనర్ కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. రంగస్థల నటులు రేబాల శ్రీలక్ష్మి, మల్లిబాబు, శ్రీకంఠం నాగరాజారావును సత్కరించారు. వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, ఆంజనేయులు, దువ్వూరు బెనర్జీ పాల్గొన్నారు.

# డీ వార్మింగ్ డేను విజయవంతం చేయండి

• కలెక్టర్ హరినారాయణన్



అధికారులతో మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఈ నెల తొమ్మిదిన విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండాజోల్ మాత్రలను విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. సుమారు ఏడు వేల కేంద్రాల్లో ఈ మాత్రలను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలను వేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా రక్తహీనతను నివారించొచ్చని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో మాత్రలను చేరవేయాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో 100 శాతం విజయవంతమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రతి ఒక్క విద్యార్థికీ నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలన్నారు. డీఈఓ, ఆర్‌ఐఓ, ఐసీడీఎస్ పీడీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపాల్టీలు, మండల కేంద్రాల్లో సీఆర్పీలు, ఎంఈఓలు, ఎంపీడీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని ఒకట్రెండేళ్ల వయస్సు గల చిన్నారులకు ఆశ కార్యకర్త, ఏఎన్‌ఎంలు ఇంటికి వెళ్లి మాత్రలు అందించాలన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు సగం టాబ్లెట్, రెండు నుంచి 19 ఏళ్లలోపు వారికి ఒక మాత్ర వేయాలన్నారు. మాత్రలను ఎట్టి పరిస్థితుల్లో నేరుగా మింగించరాదని, భోజనం తర్వాత నమిలి చప్పరించి మింగేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం నలిపురుగుల నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కమిషనర్ వికాస్ మర్మత్, డీపీఓ సుస్మిత, డీఈఓ గంగాభవాని, ఆర్‌ఐఓ శ్రీనివాసులు, సీడీపీఓ అనూరాధ, డీసీహెచ్ రమేష్‌నాథ్, మెడికల్ ఆఫీసర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ చేస్తే తక్షణమే స్పందిస్తా




మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగర ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా.. తనకు ఒక్క ఫోన్ చేస్తే తక్షణమే స్పందించి.. వాటిని పరిష్కరిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో పార్టీ నేతలతో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని చెప్పారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై మైపాడు రోడ్డు, మూడో మైలు సెంటర్, శెట్టిగుంట రోడ్డు, వీవర్స్‌కాలనీ వద్ద అవగాహన క్యాంపులను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత సురేంద్రరెడ్డి మాట్లాడారు. దేశంలోని ప్రతి వ్యక్తికీ లబ్ధి చేకూరేలా పలు సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలపై మెగా స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అదనపు డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, బీజేపీ నేతలు రాజేశ్వరమ్మ, ఆదినారాయణ, జయచంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత విద్యపై అవగాహన నేడు

నెల్లూరు (టౌన్): నైపుణ్యం, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన, చర్చా కార్యక్రమాన్ని నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించనున్నామని కళాశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ రామ్మోహన్ హాజరుకానున్నారని చెప్పారు.

### బాలల హక్కులపై అవగాహన

నెల్లూరు (టౌన్): బాలల హక్కులు – చట్టాలు.. బాలికల సంరక్షణపై అవగాహన సదస్సును మూలాపేటలోని ఈఎస్‌ఆర్‌ఎం స్కూల్లో ప్రజాసత్తా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, జిల్లా యువజన సంక్షేమ శాఖ మేనేజర్ శ్రీనివాసులు, బాలల సంరక్షణ జిల్లా అధికారి సమత, ప్రజాసత్తా రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు ప్రసాద్, ప్రజాసత్తా ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సేవా సంఘ వార్షికోత్సవ సభ నేడు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ బ్రాహ్మణ సేవా సంఘ వార్షికోత్సవ సభను ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం నిర్వహించనున్నామని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, కాంతారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘానికి విశిష్ట సేవలందించిన వారిని సత్కరించనున్నామని చెప్పారు. సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### ఎస్సైలకు సన్మానం



నెల్లూరు(క్రైమ్): బదిలీపై వెళ్తున్న ఎస్సైలు ఆయా ప్రాంతాల్లో మరింత సమర్థంగా పని చేసి పోలీస్ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ ఎస్సైలు రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, వెంకటాద్రినాయుడు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని సత్కరించారు.

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర నియోజకవర్గ ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని అంశాలను తెలియజేశారు. ఓటరు జాబితాలో కొంత మంది ఓట్లు రెండు చోట్ల ఉండటం, మరి కొందరి ఓట్లు నాట్ ట్రేస్‌గా దర్శనమివ్వడం.. తదితర అంశాలను ప్రతినిధులు తెలియజేయగా, వీటిని సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రతినిధులు నారాయణ, అబ్దుల్ అజీజ్, భువనేశ్వరి ప్రసాద్, ఎన్నికల విభాగాధికారి దేవీకుమారి, అర్బన్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మాధవి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సఫియా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సైబర్ మోసాలపై బ్యాంక్ ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని 54 డివిజన్ కార్పొరేటర్ సఫియా, నెల్లూరు రూరల్ ఎంఈఓ అబ్దుల్ హమీద్ కోరారు. ఆర్థిక అక్షరాస్యత – సైబర్ మోసాల అప్రమత్తతపై భగత్‌సింగ్ కాలనీలోని కమ్యూనిటీ భవనంలో అవగాహన సదస్సును ఆర్బీఐ సౌజన్యంతో, పొదలకూరుకు చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. పలు రకాల బ్యాంక్ పథకాలు, సేవలపై అవగాహన కలిస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. ట్రీస్ సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు నౌరాజ్, అహ్మద్, కోఆర్డినేటర్ గయాజ్, రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ముజీర్ తదితరులు పాల్గొన్నారు.

# సాయినాథుడికి విశేష పూజలు



విశేషాలంకారంలో సాయినాథుడు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయి భక్తులతో నగర సంకీర్తనను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం సాయినాథుడికి కాకడహారతి, పంచామృతాభిషేకం, సహస్రనామ పూజలను మందిర ప్రధానార్చకుడు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంసంధ్య హారతి, అష్టోత్తర పూజలు, శేజ్ హారతి తదితరాలను సాయంత్రం జరిపారు. మందిర కమిటీ చైర్మన్ కిలారి వెంకటస్వామినాయుడు, వనజాక్షి దంపతులు, మేనేజర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లపై కక్ష సాధింపు తగదు



మాట్లాడుతున్న లక్ష్మయ్య

నెల్లూరు (వేదాయపాళెం): డ్రైవర్లపై కక్ష సాధింపు చర్యలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య కోరారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన జిల్లా ఆటో కార్మిక సంఘ నగర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం అమలైతే హిట్ అండ్ రన్ పేరుతో డ్రైవర్లకు పదేళ్ల వరకు జైలు, అధిక మొత్తంలో జరిమానాను విధించే అవకాశం ఉందని చెప్పారు. ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త డ్రైవర్ల సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆటో నగర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగూర్, కార్యదర్శిగా మురళి, ట్రెజరర్‌గా బాబూరావు తదితరులతో కమిటీ ఎన్నికైంది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుధ్య పనులు



నెల్లూరు(బారకాసు): నగరంలోని 38వ డివిజన్లో గల పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మంగళవారం నిర్వహించారు. చిన్న జేసీబీ సాయంతో కాలువల్లో పూడికతీత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి దాసరి రాజేష్ మాట్లాడారు. డివిజన్లో అభివృద్ధి పనులు చేపట్టే అంశాన్ని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

# శిశు గృహలో ట్రెయినీ కలెక్టర్ పరిశీలన



నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని పోలీస్ కాలనీ సమీపంలో గల ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న శిశు గృహను ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా మంగళవారం సందర్శించారు. చిన్నారులకు అందుతున్న సేవలపై ఐసీడీఎస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బాలికల సంరక్షణ తదితర అంశాలను ఆరాతీశారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి హేనా సుజన్, ఏడీపీఓ అనూరాధ, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన సర్వేపల్లి నియోజకవర్గ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన సొంత నిధులతో అందజేశారు. పొదలకూరు రోడ్డులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నగదు ప్రోత్సాహకాలను మంత్రి కుమార్తె పూజిత ఇచ్చారు. మహిళా క్రికెట్‌లో ప్రథమ స్థానం సాధించిన కసుమూరు సచివాలయ జట్టుకు రూ.50 వేలు, వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన తోటపల్లిగూడూరు మండలం కోడూరు – 1 సచివాలయ మహిళా జట్టుకు రూ.30 వేలు, పురుషుల బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం సాధించిన పొదలకూరు జట్టుకు రూ.30 వేలు, క్రికెట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పురుషుల జట్టుకు రూ.20 వేల చొప్పున రూ.1.3 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విశాఖపట్నంలో ఈ నెల తొమ్మిది నుంచి నిర్వహించనున్న ఆడుదాం.. ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపాలని కాంక్షించారు.

# న్యాయవాదులకు నేత్ర పరీక్షలు



నెల్లూరు (లీగల్): నగరంలోని బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యుడు విద్యాచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నేత్ర పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్, జాయింట్ సెక్రటరీ వరప్రసాద్‌రావు, స్వర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పలువుర్ని మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, జామియా నూర్ – ఉల్ – హుదా అరబిక్ కాలేజీ స్థాపకుడు ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

# రొమ్ము కేన్సర్‌పై అవగాహన



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రొమ్ము కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గైనకాలజిస్ట్ లలితా షిర్డీషా హాజరయ్యారు. ప్రిన్సిపల్ గిరి, జేసీఐ ప్రెసిడెంట్ అఖిలారెడ్డి, విశ్రాంత అధ్యాపకులు భారతి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఉమామహేశ్వరి, నాగరాజు, దివ్య, పీఆర్వో జోజీ పాల్గొన్నారు.

# శ్రీనివాసరావు వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న సురేష్

నెల్లూరు(వేదాయపాళెం): అవసరమైతే సమ్మె చేస్తామంటూ ఏపీ ఎన్జీఓ నేత బండి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ విమర్శించారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ విషయంలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యోగుల ఉద్యమాన్ని నీరుగార్చిన ఘనత ఏపీ ఎన్జీఓ నేతలకే దక్కుతుందని విమర్శించారు. నేతలు మందా బాబ్జీ, రావూరి రమణయ్య, కొమ్మల కృష్ణయ్య, విడవలూరు శ్రీకాంత్, కొల్లూరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని 46వ డివిజన్లో ఆరోగ్యశ్రీ కార్డులు, కళ్లద్దాలను కార్పొరేటర్ వేలూరు మహేష్ మంగళవారం అందజేశారు. స్థానిక క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వేలూరు రఘు, వేలూరు రాధయ్య, సుబ్బారావు, లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న అల్తాఫ్ హుస్సేన్

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టెక్కేమిట్ట, పరిసర ప్రాంత ప్రజలకు అవగాహనను మంగళవారం కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును ప్రజలు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని నిందితులను బైండోవర్ చేస్తున్నామన్నారు. తమ ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తిస్తే డయల్ 112, 94407 96308 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.